మద్యం వ్యాపారానికి అద్దె షాక్

● నగరంలో 20 దుకాణాలకు 739 దరఖాస్తులు

కర్నూలు: ఎక్కువ మంది మద్యం వ్యాపారులు కర్నూలు నగరం వైపు చూస్తున్నారు. కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలో 20 దుకాణాలకు బుధవారం సాయంత్రం 7 గంటల సమయానికి 739 మంది దరఖాస్తు చేశారు. ఈ సంఖ్య వెయ్యి దాటే అవకాశమున్నట్లు ఎక్సైజ్ అధికారులు అంచనా వేస్తున్నారు. బుధవారం ఒక్క రోజే 370 మంది దరఖాస్తు చేసుకున్నారు. కర్నూలు జిల్లాలో 99 దుకాణాలకుగాను ఇప్పటివరకు 88 దుకాణాలకు 2,058 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వానికి ఇప్పటికే దరఖాస్తు రుసుం ద్వారా దాదాపు రూ.80 కోట్ల మేర ఆదాయం సమకూరింది. మరో రెండు రోజులు దరఖాస్తు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించడంతో మరో రూ.10 కోట్లకు పైగా దరఖాస్తుల ద్వారానే ఆదాయం సమకూరే అవకాశముందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని నగర పంచాయతీల పరిధిలో ఉన్న దుకాణాలకు కూడా రెండు రోజుల నుంచి దరఖాస్తులు ఊపందుకున్నాయి.

భారీగా పెరిగిన అద్దెలు...

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేసే గదులకు రూ.50 వేలు అద్దె ఉండేది. కానీ ఈ నెల 14 నుంచి నూతన మద్యం పాలసీ అమల్లోకి వస్తున్నందున దుకాణాల వేటలో మద్యం వ్యాపారులు నిమగ్నమయ్యారు. ఒక్కొక్క దుకాణానికి రూ.2 లక్షలు అద్దె, రూ.10 లక్షలు అడ్వాన్స్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు పాత మద్యం వ్యాపారులు వాపోతున్నారు. గతంలో కొత్తబస్టాండ్ సమీపంలోని మార్కెట్ యార్డు ఎదురుగా మద్యం దుకాణం ఉండేది. ప్రస్తుతం అక్కడ కూల్‌డ్రింక్ షాప్ నడుస్తోంది. మద్యం షాపు ఏర్పాటుకు యజమానితో చర్చలు జరపగా రూ.10 లక్షలు అడ్వాన్స్, రూ.2 లక్షలు బాడుగ చెల్లించే విధంగా ఖరారు చేసుకున్నారు. కర్నూలు నగరంలో ఎక్కడ దుకాణం ఏర్పాటు చేయాలన్నా ఈ మేరకు యజమానులు అద్దెలు డిమాండ్ చేస్తున్నట్లు ఎక్సైజ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఒక్క దుకాణం దక్కినా చాలనే భావనతో...

లాటరీలో ఒక్క దుకాణం దక్కినా చాలనే భావనతో మద్యం టెండర్ల దాఖలుకు ఆశావహులు రెండు రోజులుగా ఎక్సైజ్ స్టేషన్లకు క్యూ కడుతున్నారు.



మద్యం దుకాణం ఏర్పాటుకు అద్దెకు ఇస్తామంటూ తగిలించిన బోర్డు

దరఖాస్తుల దాఖలు ప్రక్రియ బుధవారంతో ముగించాల్సి ఉంది. అయితే వివిధ కారణాల రీత్యా 11వ తేదీ వరకు గడువు పెంచారు. పరిమితి లేకపోవడంతో దుకాణానికి ఒక్కొక్కరు ఐదు దరఖాస్తులు కూడా దాఖలు చేశారు. ఒక్కటైనా తగలకపోతుందా అనే భావనతో పోటీ పడుతున్నారు. దరఖాస్తుల దాఖలుకు రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు రోజులు గడువు పెంచడంతో కర్నూలు జోన్ పరిధిలో 4 వేలకు పైగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈనెల 14న లాటరీ విధానంలో మద్యం దుకాణాలను కేటాయించడానికి ఎక్సైజ్ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఎంట్రీ పాసులు జారీ చేసి లాటరీ కార్యక్రమానికి అనుమతిస్తారు.

క్లుప్తంగా

13 నుంచి ఉరుసు


సయ్యద్ అల్లాబకాష్ వలీ దర్గా

కర్నూలు(అర్బన్): నగర పరిధిలోని జొహరాపురంలో సయ్యద్ అల్లాబకాష్ వలీ ఉరుసు మహోత్సవాలను ఈ నెల 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు దర్గా ముతవల్లి (నిర్వాహకులు) సయ్యద్ అల్లా ఉద్దీన్ షరీఫ్ పాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13న గంధం, 14న ఉరుసు (తట్టీలు), 15న కిస్తీలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. జొహరాపురంలో హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు కలిసి మూడు రోజుల పాటు సామరస్యంగా ఉరుసు జరుపుకుంటారని వివరించారు. ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నట్లు తెలిపారు. దాదాపు 370 ఏళ్లుగా ఉరుసు మహోత్సవాలు జరుగుతున్నాయని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

బాధితుడికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి

కర్నూలు(సెంట్రల్): స్థానిక అంబేడ్కర్ కాలనీకి చెందిన భవానీజీ కుమారుడు ఉదయ్‌కుమార్ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. కుటుంబసభ్యులు పలుచోట్ల ఆసుపత్రుల్లో చూపించారు. తీవ్ర ఆర్థిక కష్టాల్లో ఉన్న వారి పరిస్థితిని తెలుసుకుని అంబేడ్కర్ నగర్ కాలనీ సీపీఐ శాఖ తరపున రూ.25 వేలు వసూలుచేశారు. ఈ మొత్తాన్ని బుధవారం బాధితుడి తండ్రి భవానీజీకి సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి అందజేశారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థుల క్యాండిల్ లైట్ మార్చ్


క్యాండిల్ లైట్ మార్చ్ నిర్వహిస్తున్న వైద్య విద్యార్థులు

కర్నూలు(హాస్పిటల్): కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ హాస్పిటల్‌లో రెండు నెలల క్రితం పీజీ విద్యార్థినిపై జరిగిన హత్యాచారానికి నిరసనగా బుధవారం సాయంత్రం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో విద్యార్థులు క్యాండిల్ లైట్ మార్చ్ నిర్వహించారు. హత్యాచారం జరిగి రెండు నెలలైనా ఇంకా న్యాయం జరగకపోవడంతో వారు ఈ కార్యక్రమం చేపట్టారు. ఆసుపత్రి ఆవరణలో కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు అనంత్, హరి, నర్మద తదితరులు పాల్గొన్నారు.

ఈఓ అవినీతిపై విచారణ జరిపించాలి

కర్నూలు(సెంట్రల్): కాల్వబుగ్గ రామేశ్వర స్వామి దేవస్థానం ఈఓ కేవీ ప్రసాదు అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలని బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర సభ్యుడు చామకూర వీరప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ పి.రంజిత్‌బాషాను బీజేపీ నాయకులు ఆయన చాంబరులో కలసి వినతిపత్రం ఇచ్చారు. ఆలయ భూముల్లో పవర్ టవర్లు ఏర్పాటు చేసినందుకు వస్తున్న డబ్బులో ఈవో అవినీతికి పాల్పడుతున్నారని వివరించారు.

ముగిసిన చిల్డ్రన్స్ క్యాంపు


విజేతలకు బహుమతులు అందజేసిన డైరెక్టర్ ప్రభుదాస్

కర్నూలు (టౌన్): స్థానిక కోల్స్ కళాశాల ప్రాంగణంలో మూడు రోజులుగా ఇవాంజలిజమ్ ఫెలోషిప్ కర్నూలు శాఖ అధ్వర్యంలో నిర్వహిస్తున్న 13వ చిల్డ్రన్స్ క్యాంపు కార్యక్రమం బుధవారం సాయంత్రం ముగిసింది. బైబిల్ క్విజ్, స్క్రిప్ట్ పోటీల్లో ప్రతిభ కనబరచిన చిన్నారులకు సంస్థ డైరెక్టర్ ప్రభుదాస్ బహుమతులు అందజేశారు. ఎస్టీబీసీ కళాశాల కరెస్పాండెంట్ రెవరెండ్ డాక్టర్ ఆర్ఆర్‌డి.సజీవరాజు, ప్రిన్సిపాల్ ప్రశాంతి స్టీఫెన్, కోల్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

బహుజనుల గొంతుక కాన్షీరాం

కర్నూలు(అర్బన్): కులాన్ని నిర్మూలిద్దాం, బహుజన సమాజాన్ని నిర్మిద్దాం అనే నినాదంతో దేశవ్యాప్త ఉద్యమాన్ని చేపట్టిన బహుజనుల గొంతుక మాన్యశ్రీ కాన్షీరాం అని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి అన్నారు. బుధవారం కాన్షీరాం వర్ధంతి, ఫాతిమా షేక్ వర్ధంతి సందర్భంగా స్థానిక కార్యాలయంలో వారి చిత్రపటాలకు మహిళా నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి, మహిళా నేతలు ఖాసీంబీ, రంగమ్మ, అమీనాబీ తదితరులు పాల్గొన్నారు.

మెప్మాలో అంతర్గత బదిలీలు

కర్నూలు (టౌన్): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో పనిచేస్తున్న కమ్యూనిటీ ఆర్గనైజర్లకు పని విభజన, మార్పులు, చేర్పులు చేస్తూ బుధవారం మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ నాగ శివలీల ఉత్తర్వులు జారీ చేశారు. జి.అదెమ్మ (1, 3, 25 వార్డులు), ఎస్.ఆర్.వి.సుబ్బారెడ్డి (47, 49, 50 వార్డులు), కె.నాగరాణి (31, 33, 34, 35), ఎం.సుధాకర్ (18, 31 వార్డులు), ఎ.ఎస్.సబీహా సుల్తానా (17, 19, 21, 42 వార్డులు) బి.అనితమ్మ (6, 7 వార్డులు), ఎల్.పుల్లయ్య (10, 11, 15, 29, 32, 40, 41 వార్డులు), పి.విజయభారతి (28, 29, 30, 40 వార్డులు), జి.సరోజ (23వ వార్డు), కె.విజయభాస్కర్ రెడ్డి (24, 26 వార్డులు), ఏ.వినయ్‌కుమార్ (22, 25, 44, 45, 46, 47 వార్డులు), డి.పుష్పావతి (13, 41, 42, 44 వార్డులు), పి.అరుణమ్మ (4, 5 వార్డులు), అలాగే స్టాంటన్ పురానికి కమ్యూనిటీ ఆర్గనైజర్ కె.నాగరాణి, మామిదాలపాడు బి.అనితమ్మకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

నేటి నుంచి ఆర్‌యూకు దసరా సెలవులు

కర్నూలు కల్చరల్: దసరా పండుగను పురస్కరించుకొని రాయలసీమ యూనివర్సిటీకి సెలవులు ప్రకటిస్తూ సర్క్యులర్ జారీ చేశారు. ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు సెలవులు ప్రకటించినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. 14వ తేదీన వర్సిటీ పునఃప్రారంభమవుతుందని పేర్కొన్నారు. 10వ తేదీన సెలవు దినాన్ని భర్తీ చేసేందుకు వచ్చే రెండు నెలల్లో ఒక రెండో శనివారం పనిచేయాల్సి ఉంటుందని సర్క్యులర్‌లో పేర్కొన్నారు.


నాగలాపురంలో..


లలితా పీఠంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

సరస్వతీ నమస్తుభ్యం


బండిమెట్ట అంబా భవాని ఆలయంలో..


వెంకాయపల్లి ఎల్లమ్మ ఆలయంలో..


సత్యసాయి మందిరంలో..


కల్లూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో..

కర్నూలు కల్చరల్: దశసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు బుధవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయాల్లో అమ్మవారిని సరస్వతీ దేవీగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అక్షరాభ్యాసాలు, కన్య పూజలు, మూలా నక్షత్ర పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. పంచామృతాభిషేకాలు, హోమాలు, రథోత్సవం, పల్లకీ సేవ, లలితా సహస్రనామ పారాయణం, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన దుర్గా మాత విగ్రహాలకు పూజలు చేశారు. ఆధ్యాత్మిక నృత్యాలు, భక్తి సంగీత కచేరీలు, సంకీర్తనలు, కోలాటం, చెక్క భజన, హరి కథలు, నవరాత్రులపై ప్రవచనాలు జరిగాయి. ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కేడీసీసీబీ మాజీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి నగరంలోని పలు దుర్గామాత మండపాలను సందర్శించి పూజల్లో పాల్గొని అన్నాదానం చేశారు.


నిమిషాంబదేవి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


గీతా మందిరంలో..


లలితా పీఠంలో లలితా సుందర దేవి


సప్తగిరి నగర్ చౌడేశ్వరి ఆలయంలో..


నిమిషాంబ దేవి ఆలయంలో..


నన్నూరు సరస్వతీ ఆలయంలో..


బీక్యాంప్ క్వార్టర్స్‌లో కొలువు దీరిన దుర్గమ్మ


పాత కల్లూరులో..


తెలుగు వీధిలో..


బుధవార పేట కాళికాంబ ఆలయంలో..


గణేష్ నగర్‌లో..


భరతమాత ఆలయంలో..


గోదాగోకులంలో..


సప్తగిరి నగర్ చౌడేశ్వరి దేవి ఆలయంలో..


సూర్య నారాయణ స్వామి ఆలయంలో..

సుస్థిర ఆస్తుల కల్పనే ధ్యేయంగా పనులు

కర్నూలు (అర్బన్): జిల్లాలో సుస్థిర ఆస్తుల కల్పనే ధ్యేయంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు జరగాలని జెడ్పీ సీఈఓ, డ్వామా ఇన్‌చార్జ్ పీడీ జి.నాసరరెడ్డి సూచించారు. బుధవారం పీడీగా బాధ్యతలు చేపట్టిన ఆయన జిల్లా పరిషత్‌లోని తన చాంబర్‌లో ఏపీడీ, ఏపీఓలతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలని సూచించారు. పండ్ల తోటల పెంపకంలో నిర్దేశించిన లక్ష్యం 5 వేల ఎకరాలను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ప్రతిరోజూ 50 వేల మంది వేతనదారులకు పనులు కల్పించాలని, రోజుకు రూ.300 కూలీ పడే విధంగా పనులు చేపట్టాలన్నారు. గ్రామాల్లో ఫారం పాండ్‌లు ఏర్పాటు చేయించి భూగర్భ జలాలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే మొక్కల పెంపకం, ఉద్యాన వనాలను అభివృద్ధి చేయాలన్నారు. అలాగే ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు గ్రామాల్లో చేపట్టే పల్లె పండుగ వారోత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. డ్వామా అదనపు పీడీ మాధవీలత, ఏపీడీలు లక్ష్మన్న, లోకేశ్వర్, పద్మావతి, అల్లిపీరాన్, పక్కీరప్ప తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ పీడీ జి.నాసరరెడ్డి

చేగువేరాకు నివాళి

కర్నూలు(సెంట్రల్): నేటి యువత చేగువేరా పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో చేగువేరా జయంతి పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మెడికల్ విద్యార్థిగా ఉన్న చేగువేరా లాటిన్ అమెరికాలో పర్యటించి పేదరికాన్ని చూసి పరివర్తన చెందారన్నారు. ఆయన పోరాటాలను ఏఐవైఎఫ్ ఆదర్శంగా తీసుకుంటుందన్నారు. నాయకులు మహేష్, మునిస్వామి, చంటి, రవి, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ సీఈఓకు డ్వామా పీడీ బాధ్యతలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా నీటియాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్‌గా జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి నియమితులయ్యారు. ఇక్కడ పీడీగా పనిచేస్తున్న అమరనాథరెడ్డి బదిలీపై వెళ్లడంతో తొలుత వాటర్‌షెడ్స్ అదనపు పీడీ మాధవీలతను ఇన్‌చార్జ్ పీడీగా కలెక్టర్ రంజిత్‌బాషా నియమించారు. ఈమె రెండు రోజులు పీడీగా విధులు నిర్వహించారు. ఈ క్రమంలో బుధవారం జెడ్పీ సీఈఓను ఇన్‌చార్జ్ పీడీగా నియమించారు. ఈయన బుధవారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించారు. కాగా డ్వామా రెగ్యులర్ పీడీగా శివప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం గత నెల 22న ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన ఇక్కడ బాధ్యతలు స్వీకరిస్తారా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

హెచ్‌ఆర్‌సీలో దుర్గామాతకు పూజలు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్‌సీ) కార్యాలయంలో బుధవారం అధికారులు నవరాత్రులను పురస్కరించుకొని దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఆర్‌ఓ హనుమంతరెడ్డి, సెక్షన్ ఆఫీసర్లు జి.సునీత, బొగ్గరం తారక నరసింహకుమార్, ఇన్వెస్టిగేషన్ టీం సభ్యులు డీఎస్పీ ఈబాలస్వామి, నల్లమిల్లి శ్రీనివాసులురెడ్డి, ధనరాజ్ హాజరవ్వగా వేదమంత్రోచ్చరణ మధ్య అర్చకులు దుర్గామాతకు అభిషేకం, అష్టోత్తరం, కుంకుమ పూజలు నిర్వహించారు. ఉద్యోగులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

జిల్లా నటీనటులకు అభినందన

కర్నూలు కల్చరల్: యూట్యూబ్ చానెల్ ఆహా ద్వారా విడుదలై ప్రేక్షకులను అలరిస్తున్న తెలుగు చలన చిత్రం బాలుగాని టాకీస్‌లో నటించిన కర్నూలు కళాకారులను పలువురు రంగస్థల కళాకారులు క్రిష్టఫర్, గోపిశెట్టి వెంకటేశ్వర్లు, మహమ్మద్ మియా అభినందించారు. డోన్ పట్టణానికి చెందిన విశ్వనాథ్ ప్రతాప్ ఈ సినిమాకు దర్శకత్వం వహించడం, కర్నూలుకు చెందిన నటులు ఇనాయతుల్లా, మీనాక్షి రెడ్డి, వేమూరి పరమేశ్వర శర్మ, శంభుప్రసాద్, డోన్ వాస్తవ్యుడు శేఖర్ ఈ చిత్రంలో నటించడం అభినందనీయమన్నారు. ఈ సినిమా పూర్తి కర్నూలు మాండలికంలో సాగుతూ పల్లెటూరు ప్రేక్షకులను ఎంతగానో ప్రభావితం చేయగలదని పేర్కొన్నారు. జిల్లా నుంచి వెలువడిన కథా సంకలనాలలో కర్నూలు మాండలికం బాగా ప్రచారంలోనికి వచ్చిందని, ఈ సినిమా ద్వారా తొలిసారిగా పూర్తి మాండలికం ప్రాచుర్యం పొందిందని కథా రచయిత పౌరోహితం మారుతి అన్నారు. ×ఆహా×లో ప్రసారమవుతున్న ఈ సినిమాను ప్రేక్షకులు వీక్షించవచ్చని నటులు మీనాక్షి రెడ్డి తెలిపారు.

16లోపు అందుబాటులోకి ఇసుక రీచ్

కర్నూలు న్యూసిటీ: ఈ నెల 16వ తేదీలోపు మరళి- 1 ఇసుక రీచ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు గనులు, భూగర్భ ఖనిజాల శాఖ ఉప సంచాలకులు వి.రవిచంద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన తన సిబ్బందితో కలిసి ఇసుక రీచ్‌ను పరిశీలించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇసుక కొరతను అధిగమించేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మరో ఇసుక రీచ్ మరళి-1ను ప్రారంభించేందుకు జిల్లా ఇసుక నియంత్రణ కమిటీ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. దాదాపు 4.84 హెక్టార్లలో రీచ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఇంతవరకు ఉన్న ఇసుక రీచ్‌లలో పర్యావరణానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నీటి పారుదలశాఖ ఆధ్వర్యంలో యంత్రాల ద్వారా ఇసుక వెలికి తీస్తున్నారన్నారు. వెలికి తీసిన ఇసుకను రిజిస్ట్రేషన్ కలిగిన వాహనాలకు చలానాల నింపుతున్నారు. అక్కడి నుంచి ఇసుక ధరతో పాటు రవాణా చార్జీలు ఆన్‌లైన్‌లో యాప్ ద్వారా చెల్లించిన వినియోగదారులకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ రీచ్‌లో కాంట్రాక్టర్ల ద్వారా ఇసుకను వెలికి తీసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. నది నుంచి ఇసుకను బయటకి తీసిన కాంట్రాక్టర్‌కు క్వింటా ఇసుకకు రూ.109 చెల్లించేలా ప్రతిపాదనలు ఉన్నట్లు తెలిపారు. ఈ విషయాలన్నింటినీ డిస్ట్రిక్ లెవెల్ శాండ్ కమిటీలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

కర్నూలు(హాస్పిటల్): మానసిక ఒత్తిడి సాకుతో చెడు అలవాట్లకు బానిస కావొద్దని కర్నూలు మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్ సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాల మానసిక వ్యాధుల విభాగంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి మనిషి జీవితంలో ఒత్తిడి ఉంటుందని, దీన్ని సాకుగా చేసుకుని చెడు అలవాట్లకు లోనైతే సమస్యలు ఇంకా అధికం అవుతాయన్నారు. ఇలాంటి సమయంలో మానసిక వైద్యులను కలిసి చికిత్స తీసుకోవాలని చెప్పారు. సైకియాట్రి విభాగాధిపతి డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పని ప్రదేశంలో ఒత్తిడికి దూరంగా ఉండాలని సూచించారు. వైద్య, నర్సింగ్ విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు, వైద్యాధికారులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.


పోస్టర్లను ప్రదర్శిస్తున్న వైద్యాధికారులు

క్రీడాకారులకు అభినందన

కర్నూలు (టౌన్): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించిన 37వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో కర్నూలు క్రీడాకారులు పాల్గొని బంగారు పతకాలు సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను బుధవారం కలెక్టర్ రంజిత్‌బాషా తన చాంబర్‌లో అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అథ్లెట్లు 7 బంగారు పతకాలు, 8 వెండి, 12 కాంస్య పతకాలు సాధించారని, మరో ఐదుగురు అథ్లెట్లు సౌత్‌జోన్ స్థాయి జాతీయ పోటీలకు ఎంపిక కావడం హర్షణీయమన్నారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, అథ్లెటిక్స్ శిక్షకులు కాశీరావు పాల్గొన్నారు.


క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

టీడీపీలో చేరిన కార్పొరేటర్‌కు భంగపాటు

● డైరెక్టర్ పదవి నుంచి తప్పించి మరొకరికి అవకాశం

కర్నూలు (టౌన్): ఆమె మహిళా కార్పొరేటర్. నగరపాలక సంస్థలో 17వ వార్డుకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఫ్యాన్ గుర్తు మీద వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్‌గా గెలిచింది. పార్టీ ఆమెకు స్టాండింగ్ కమిటీ సభ్యులుగా అవకాశం కల్పించింది. అయితే సార్వత్రిక ఎన్నికల ముందు టీడీపీలో చేరింది. ఇటీవల పదవి కేటాయించారు. అయితే వారం తిరక్కముందే ఆ పదవి నుంచి తప్పించారు. నగర పాలక సంస్థలో 17వ వార్డు కార్పొరేటర్ కైపా పద్మాలత రెడ్డి తండ్రి విద్యావేత్తతో కలిసి ఎన్నికల ముందు టీడీపీ జాతీయ నాయకుడు లోకేష్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. పార్టీ అధ్యక్షుడు చంద్రబాబును కలిసి కండువాలు కప్పుకున్నారు. అప్పట్లో వీరిరువురికి పార్టీ అధికారంలోకి వస్తే పదవులు ఇస్తామని మాట ఇచ్చారు. అధికారంలోకి వచ్చారు. ఇటీవల ఆ పార్టీ కార్పొరేషన్ పదవులు, చైర్మన్లు, డైరెక్టర్ పోస్టులను భర్తీ చేసింది. ఇచ్చిన మాట ప్రకారమే ఆమెను పర్యాటక శాఖ డైరెక్టర్‌గా నియమించారు. అంతా సంతోషపడ్డారు. అయితే నిన్న గాక మొన్న పార్టీలో చేరిన వారికి పదవులు ఇవ్వడం ఏంటని అధిష్టానానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. పార్టీలో మొదటి నుంచి పని చేస్తున్న తమకు అన్యాయం చేయడం ఏమిటని ప్రశ్నించడంతో కార్పొరేటర్ కైపా పద్మాలతా రెడ్డిని డైరెక్టర్ పదవి నుంచి తప్పించారు. ఆ స్థానంలో కర్నూలు నగర తెలుగు మహిళా అధ్యక్షురాలిగా కొనసాగుతున్న ముంతాజ్‌ను డైరెక్టర్‌గా నియమించారు. అమె మంగళవారం మంత్రి సమక్షంలో సంబరాలు చేసుకున్నారు. దీంతో టీడీపీలో చేరిన కార్పొరేటర్‌కు భంగపాటు తప్పలేదు. ఇచ్చిన పదవిని లాక్కోవడం ఏంటని ఆవేదన వ్యక్తం చేయడం కన్న ఇంకేమి చేస్తారన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది. టీడీపీని నమ్మి వెళితే ఇలా ఉంటుందా? అన్న చర్చ మొదలైంది

ఆందోళనకు మద్దతు

కర్నూలు(సెంట్రల్): తమిళనాడులో జీతాలు పెంచాలని ఆందోళన చేస్తున్న సాంసంగ్ కార్మికులకు మద్దతు తెలుపుతున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి జే.నాగేశ్వరరావు, నగర ఉపాధ్యక్షుడు కె.సుధాకరప్ప ప్రకటించారు. బుధవారం సీఐటీయూ నగర కమిటీ ఆధ్వర్యంలో గాయత్రీ ఎస్టేట్‌లోని ఆ కంపెనీ బ్రాంచ్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీతాలు పెంచమని అడిగితే ఉద్యోగం నుంచి తొలగిస్తామని వేధించడం అన్యాయమన్నారు. పనిగంటలను పెంచడం కార్మిక చట్టాలను వ్యతిరేకమన్నారు. కార్మికులను వేధింపులకు గురిచేస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.రాధాకృష్ణ, మాలిక్‌బాషా, జి.ఏసు, బతుకన్న పాల్గొన్నారు.

వంటనూనెల ధరల కట్టడికి చర్యలు

● రైతు బజార్లలో ఉల్లి కేజీ రూ.36, టమాటాలు కేజీ రూ.42 ప్రకారం లభ్యం

కర్నూలు(సెంట్రల్): వంటనూనెల ధరలు పెరిగిపోతున్న నేపథ్యంలో తక్కువ ధరకే సన్‌ఫ్లవర్, పామాయిల్, ఉల్లి, టమాటాలను అందించేందుకు చర్యలు చేపట్టినట్లు డీఎస్ఓ రాజారఘువీర్ బుధవారం తెలిపారు. గురువారం నుంచి నిర్దేశించిన షాపుల్లో వాటిని కొనుగోలు చేయవచ్చన్నారు. జిల్లాలోని అన్ని రైతు బజార్లలో కేజీ టమాట రూ.42, కేజీ ఉల్లి రూ.36కు విక్రయించేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. సన్‌ఫ్లవర్ ఆయిల్‌కు సంబంధించి సన్‌ప్యూర్, సన్‌జ్యోతి, సన్‌ప్రీతి లీటర్ రూ.126 ప్రకారం అన్ని రైతు బజార్లు, బహిరంగ మార్కెట్లలో అందుబాటులో ఉంచినట్లు వివరించారు. డీమార్టులో సన్‌ప్యూర్ లీటర్ రూ.125, రిలయన్స్‌మార్టులో గుడ్‌లైఫ్ లీటర్ రూ.119కే అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. కర్నూలు చౌక్ బజార్‌లోని రాయల్ కంపెనీలో రాయల్ గోల్డ్ పామాయిల్ లీటర్ రూ.119, జ్యోతిమాల్‌లో ప్రియగోల్డ్ లీటర్ రూ.121, అంబికా ఆయిల్ మిల్‌లో పామ్‌గోల్డ్ లీటర్ రూ.119 ప్రకారం అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు.